క్లుప్తంగా

రేపు ధర్మభిక్షం జయంతి

చిలుకూరు : మాజీ ఎంపీ, గీత పనివారల సంఘం జాతీయ అధ్యక్షుడు బొమ్మగాని ధర్మభిక్షం జయంతిని గురువారం అన్ని గ్రామాల్లో నిర్వహించాలని గీత పనివారల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య కోరారు. మంగళవారం ఆయన చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న సంక్రాంతి ఫౌండేషన్ సభ్యులు, హెచ్‌ఎం

చిలుకూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు చిలుకూరు సంక్రాంతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పరీక్ష సామగ్రి అందజేశారు. పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు కరుణాకర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు పట్టా నాగరాజు, షేక్ రఫీ, బాబా, వినయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయులుగా దంపతుల ఎంపిక



సృజన్, శ్యామల

నడిగూడెం : మండల కేంద్రానికి చెందిన కలకొండ సృజన్‌కుమార్, శ్యామల దంపతులు వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికైనట్లు సృజన్‌కుమార్ మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ రిక్రూట్‌మెంట్ బోర్డు ప్రవేశ పరీక్ష ఫలితాల్లో వారు ఎంపిక అయినట్లు తెలిపారు. అలాగే రామాపురంనకు చెందిన నేలమర్రి మంగమ్మ ఎంపికయ్యారు. వ్యాయామ ఉపాధ్యాయులుగా ఎంపికైన ముగ్గురికి పలువురు అభినందనలు తెలిపారు.

ఫిజికల్ డైరెక్టర్‌గా గురవయ్య ఎంపిక

హుజూర్‌నగర్‌రూరల్ : తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు ఇటీవల విడుదల చేసిన ఫలితాల్లో హుజూర్‌నగర్ మండలంలోని వేపలసింగారం గ్రామానికి చెందిన చడపంగు గురవయ్య సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌గా ఎంపిక అయ్యాడు. తెలంగాణ 5వ జోన్‌లో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంక్ సాధించి ఉద్యోగం సాధించాడు. దీంతో ఆయనను పలువురు గ్రామ పెద్దలు అభినందించారు.

పాలకవర్గ సమావేశం నిర్వహించాలని నోటీసులు

నడిగూడెం : మండల కేంద్రంలోని సహకార సంఘం కార్యాలయంలో ఈ నెల 29న పాలకవర్గం సమావేశం నిర్వహించాలని మంగళవారం డీసీఓ నామా శ్రీధర్ డైరెక్టర్లకు నోటీసులు జారీ చేశారు. చైర్మన్ అక్రమాలకు పాల్పడుతున్నారని గత ఏడాది డిసెంబర్ 29న డీసీఓకు ఫిర్యాదు చేయడంతో జనవరి 20 ప్రత్యేక పాలకవర్గం సమావేశం నిర్వహించాలని పాలకవర్గం సభ్యులకు నోటీసులు జారీ చేశారు. దీంతో చైర్మన్ ట్రిబ్యునల్‌కు వెళ్లి స్టే తెచ్చుకోవడంతో ఆ సమావేశం నిలిచిపోయింది. మళ్లీ పలువురు పాలకవర్గ సభ్యులు హైకోర్టును ఆశ్రయించడంతో ట్రిబ్యునల్ ఇచ్చిన స్టేను కొట్టివేసింది. దీంతో ఈ నెల 29న పాలకవర్గం సమావేశం నిర్వహించాలని డీసీఓ నోటీసులు జారీ చేశారు.

దాతల సహకారం అభినందనీయం



అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎంపీపీ పెండెం సుజాత, లయన్స్ క్లబ్ సభ్యులు

గరిడేపల్లి : విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని ఎంపీపీ పెండెం సుజాతా శ్రీనివాస్‌గౌడ్, ఎంఈఓ పానుగోతు చత్రునాయక్ అన్నారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంతో పాటు గానుగబండ, కల్మలచెరువు, పొనుగోడులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు అల్పాహారం పంపిణీ చేశారు. కాగా, లయన్స్ క్లబ్ నేరేడుచర్ల ప్రోత్సాహంతో దాతలు మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్ రూ.10 వేలు, సుందరి కృష్ణ ఉపాధ్యాయుడు, నీల శ్రీనివాస్, రాచకొండ శబరీష్ రూ.5వేల చొప్పున అల్పాహారం ఏర్పాటుకు సహకరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్‌రెడ్డి, సభ్యులు గంట రంగారెడ్డి, చిత్రం విశ్వనాథ్, హెచ్‌ఎం నట్టి శ్రీనివాస్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, నాగమణి, రవీందర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్ అందజేత

మోతె : మండలంలోని సిరికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు దానధర్మ చారిటబుల్ ట్రస్టు సహకారంతో గోల్ తండా పాఠశాల హెచ్‌ఎం సుంకరి సురేష్ మంగళవారం ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను ఎంఈఓ కె.గోపాల్‌రావు చేతులమీదుగా అందజేశారు. పదవ తరగతి ఫలితాల్లో 9.5 జీపీఏ సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తామని హెచ్‌ఎంల సురేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీను, రాంబాబు, ఉషారాణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నీటి కష్టాలు.. రైతన్నకు తిప్పలు



రామాపురం వద్ద ఎండిపోయిన వరి పొలం



నడిగూడెం వద్ద జేసీబీతో బావి పూడిక తీయిస్తున్న రైతు

- అడుగంటిన భూగర్భజలాలు
- నీరందక ఎండిపోతున్న పొలాలు
- బావులు పూడిక తీసే పనుల్లో నిమగ్నమైన కర్షకులు

నడిగూడెం : మండలంలో రబీ సాగు కష్టతరంగా మారింది. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి సరైన వర్షాలు కురవకపోవడంతో పాటు, సాగర్ ప్రాజెక్టులో లేదు. బోర్లు, బావుల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు తమ పంటను కాపాడుకోవడం కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. గత ఖరీఫ్ సీజన్‌తో పోల్చితే ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. మండల కేంద్రంతో పాటు బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, వెంకట్రాంపురం, కాగితరామచంద్రాపురం, నారాయణపురం, సిరిపురం, వల్లాపురం, శ్రీరంగాపురం, చాకిరాల, రత్నవరం, రామాపురం, ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబల్లి గ్రామాల్లో సాగర్ నీరు రాకున్నా గత ఖరీఫ్ సీజన్‌లో బోర్లు, బావుల కింద 18,050 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. అదేబోర్లు, బావుల కింద ప్రస్తుత రబీ సీజన్‌లో 11,150 ఎకరాల సాగు చేపట్టారు. భూగర్భ జలాలు అడుగంటడంతోనే ఈ సీజన్‌లో సాగు విస్తీర్ణం తగ్గింది. అయితే పలు గ్రామాల్లో నీరందక వరి పొలాలు ఎండుతున్నాయి. దీంతో రైతులు ప్రత్యామ్నాయంగా బావుల పూడికతీత, కొత్తగా బోర్లు వేసుకునే పనులు చేపడుతున్నారు. తమ పొలాలను రక్షించుకునేందుకు అప్పులు చేసి నానా ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జేసీబీ, క్రేన్‌లకు పెరిగిన డిమాండ్

మండల వ్యాప్తంగా భూగర్భ జలాలు అడుగంటడంతో రైతులు పంటలు ఎండిపోకుండా కాపాడుకునేందుకు ప్రత్యామ్నాయంగా భారీ జేసీబీలు, క్రేన్‌లతో బావుల పూడిక తీయిస్తున్నారు. దీంతో జేసీబీ, క్రేన్‌లకు పెరిగిన డిమాండ్ పెరిగింది. జేసీబీలకు గంటకు రూ.4000 వేలు, క్రేన్‌లకు ఒక బావి పూడిక తీస్తే రూ.30 వేల నుంచి రూ.40 వేల వరకు చెల్లించి తీయించుకుంటున్నారు. పలు గ్రామాల్లో రైతులు కొత్తగా బోర్లు పూడిక తీయించుకుంటున్నారు. ఒక బోరుకు దాదాపు రూ.25 నుంచి 30 వేలు చెల్లించి తీయించుకుంటున్నారు.

ఎకరం పొలం ఎండిపోయింది



నాకున్న ఎనిమిది ఎకరాల్లో బావి కింద వరి సాగు చేపట్టాను. భూగర్భ జలాలు అడుగంటడంతో ఎకరం పొలం ఎండిపోయింది. మరో ఎకరం కూడా ఎండిపోయేలా ఉన్నది. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సీజన్‌లో సాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నాం.

– మారిశెట్టి నర్సింహారావు, రైతు, రామాపురం

చెరువులు నింపాలి



ప్రస్తుతం బోర్లు, బావి కింద 15 ఎకరాలు సాగు చేశాను. గత కొద్ది రోజులుగా బోర్లలో నీరు ఇంకిపోవడంతో పొలాలు ఎండిపోయే ప్రమాదం ఉన్నది. అధికారులు స్పందించి సాగర్ నీరు విడుదల చేసి, చెరువులను నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయి. రైతులకు సాగు నీటికి ఇబ్బంది ఉండదు.

– గార్లపాటి కమల్‌రెడ్డి, రైతు, కరివిరాల

అట్టహాసంగా స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు



బహుమతులతో విద్యార్థులు, నిర్వాహకులు

సూర్యాపేటటౌన్ : జిల్లా స్థాయి స్పెల్ విజార్డ్, డ్రామా పోటీలు ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని ఎంఏఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు వేషధారణలతో నాటికల ప్రదర్శన, ఇంగ్లిష్‌లో మాట్లాడిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది. స్పెల్ బీ విజార్డ్‌లో 30 మంది ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి, డ్రామా పోటీలో 18 పాఠశాలల నుంచి హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు. స్ట్రీమ్ 1లో మొదటి బహుమతి ఎం.రితికారెడ్డి (నెం.2 ప్రభుత్వ ఉన్నత పాఠశాల), ద్వితీయ బహుమతి ఎం.పవన్‌సూర్యా (తాళ్లసింగారం జెడ్పీహెచ్‌ఎస్), తృతీయ బహుమతి (జెడ్పీహెచ్‌ఎస్ గోరెంట్ల), స్ట్రీమ్ 2లో మొదటి బహుమతి ఇమాంపేటమోడల్ స్కూల్, ద్వితీయ బహుమతి కావ్య (బీసీ గురుకుల సింగారెడ్డిపాలెం), తృతీయ బహుమతి ఉదయ్‌కుమార్ (టీఎస్ ఎంఎస్ అనంతారం) బహుమతులు సాధించారు. నాటక పోటీల్లో స్ట్రీమ్ 1లో ప్రథమ బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ జలాల్‌పురం, ద్వితీయ బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ మేళ్లచెర్వు, తృతీయ బహుమతి జెడ్పీహెచ్‌ఎస్ పెంచికల్‌దిన్నె, స్ట్రీమ్ 2లో ప్రథమ కేజీబీవీ తిరుమలగిరి, ద్వితీయ కేజీబీవి మద్దిరాల, తృతీయ కేజీబీవీ గరిడేపల్లి విద్యార్థులు బహుమతులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంఓ డి.జనార్దన్, హెచ్‌ఎం టి.రేణుకాదేవి, ఎల్టా అధ్యక్షుడు బి.సుధీర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ పబ్బతి వెంకటేశ్వర్లు, ఎస్‌కె.షహనాజ్, ఖాసీం, తరాల వెంకన్న, రవి, రమేష్, శ్రీనివాస్, పద్మశ్రీ, స్వప్న, వర్ధెల్లి కృష్ణ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తాం

కోదాడఅర్బన్ : విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ సంఘం కృషి చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తూపురాని కీతారాం, రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగా అరుణ అన్నారు. మంగళవారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించిన డివిజన్ కమిటీ సమావేశంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పీఆర్సీ ఫిట్‌మెంట్‌ను 30 శాతం తక్కువ కాకుండా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెన్షనర్లకు కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్య సేవలు అందించాలని కోరారు. పెన్షనర్లకు 1వ తేదీనే పెన్షన్ జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సోమయ్య, ఉపాధ్యక్షుడు గడ్డం వెంకటరెడ్డి, మండల అధ్యక్షుడు ఎం.శివరామయ్య, ప్రధాన కార్యదర్శి టి.వీరబాబు, యూనియన్ సభ్యులు బండారు రంగారావు, పి.కృష్ణయ్య, రాధాకృష్ణ, భూపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

చిలుకూరు : గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని గ్రామ ప్రత్యేక అధికారి, డిప్యూటీ తహసీల్దార్ కరుణశ్రీ సూచించారు. మంగళవారం చిలుకూరు మండలంలోని బేతవోలులో పారిశుద్ధ్యంపై నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ చెత్త సేకరించాలని సూచించారు. డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రామకృష్ణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ టోర్నమెంట్ కరపత్రం ఆవిష్కరణ



కబడ్డీ టోర్నమెంట్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ, డీఈఓ తదితరులు

హుజూర్‌నగర్ : చింతలపాలెంలో ఈనెల 16 నుంచి 19 వరకు నిర్వహించే రాష్ట్ర స్థాయి 33వ సబ్ జూనియర్ కబడ్డీ టోర్నమెంట్ కరపత్రాలను ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, డీఈఓ అశోక్ మంగళవారం స్థానికులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడా స్థలాన్ని, క్రీడాకారుల వసతి గదులను పరిశీలించారు. కార్యక్రమంలో కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.రామచంద్రగౌడ్, నామ నరసింహారావు, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి, ఎస్‌ఐ సైదిరెడ్డి, ఎంఈఓ సైదానాయక్, ఆర్‌ఐ సైదా, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మోర్తాల నాగిరెడ్డి, మోర్తాల వెంకటరెడ్డి, శ్రీకాంత్, రమేష్, వీరన్న, శ్రీనివాసరెడ్డి, ప్రదీప్‌కుమార్, రమేష్ బాబు, మాతంగి సైదులు, పళ్ల శ్రీను, డి.సైదులు, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం మండల కార్యదర్శి పోషణబోయిన హుస్సేన్ కోరారు. మంగళవారం హుజూర్‌నగర్ మండల కేంద్రంలోని అమరవీరుల స్మారక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ నీళ్లు వచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు, బావులలో నీరు లేక తాగునీటి సమస్య ఏర్పడిందని తెలిపారు. గ్రామాల్లో డ్రెయినేజీలు, వీధి లైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కావున ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు చింతకుంట్ల వీరయ్య, చందాల భిక్షం, వెంకటరెడ్డి, కాసీం, రాములు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో నడిపిస్తాం

హుజూర్‌నగర్‌రూరల్ : గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి అభివృద్ధి పథంలో నడిపిస్తామని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో గల 7వ వార్డులో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ మంత్రిప్రగడ వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ రాధికా దేశ్‌ముఖ్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు యరగాని భిక్షం, సైదులు, వీరబాబు, వెంకయ్య, ఆదెమ్మ, కొండలు, మట్టయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్

మంత్రి ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్‌లోకి కౌన్సిలర్లు



మంత్రి ఉత్తమ్‌తో కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు, నాయకులు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు అట్లూరి మంజుల, ములకలపల్లి రాంగోపి, బీఆర్‌ఎస్ నాయకులు అట్లూరి హరిబాబు సోమవారం రాత్రి హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి వారికి మూడురంగుల కండువాలను కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తన్నీరు మల్లికార్జున్‌రావు, ఈడ్పుగంటి సుబ్బారావు, యరగాని నాగన్న, గెల్లి రవి, నిజాముద్దీన్, శివరాంయాదవ్, ఎ.సతీష్, జక్కుల శంబయ్య తదితరులు ఉన్నారు.

బెల్లం రవాణా కేసులో మరొకరి అరెస్ట్

హుజూర్‌నగర్ : బెల్లం రవాణా కేసులో మంగళవారం మరొకరిని అరెస్ట్ చేసినట్లు హుజూర్‌నగర్ ఎక్సైజ్ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు నుంచి అశోక్ లీలాండ్ వాహనంలో తెలంగాణకు రవాణా అవుతున్న 3వేల కిలోల బెల్లం, 50 కేజీల పటికను హుజూర్‌నగర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో పట్టుకుని సీజ్ చేశారు. స్టువర్ట్‌పురానికి చెందిన డ్రైవర్ గంజి కాలెబ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో చిత్తూరుకు చెందిన బెల్లం వ్యాపారి దోమ నాగరాజు నాయుడును అక్కడి పోలీసుల సహకారంతో అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వివరించారు. సమావేశంలో ఎక్సైజ్ అధికారులు జగన్మోహన్ రెడ్డి, వెంకన్న, రవి, నాగరాజు, నరేష్ పాల్గొన్నారు.

అసమానతలపై సరోజినీనాయుడు పోరాటం



మహిళా అధ్యాపకులను సత్కరిస్తున్న ఎమ్మెస్ విద్యా సంస్థల సీఈఓ ఎస్ఎస్‌రావు

కోదాడఅర్బన్ : సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న అసమానతలపై పోరాడిన మహోన్నత వ్యక్తి కవయిత్రి సరోజినీనాయుడు అని ఎమ్మెస్ విద్యా సంస్థల సీఈఓ ఎస్ఎస్‌రావు అన్నారు. మంగళవారం సరోజినాయుడు 145వ జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా అధ్యాపకులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు దుర్గాప్రసాద్, మమతా, సునీత, వీరకుమారి, అరుణకుమారి పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి ఆకుపూజ

హుజూర్‌నగర్‌రూరల్ : హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డలో ఉన్న శ్రీశాల్మలీకంద ఆదివరాహ లక్ష్మీనర్సింహ వేణుగోపాలస్వామి దేవాలయంలో క్షేత్రపాలకుడికి మంగళవారం ఘనంగా ఆకుపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, ఆరాధన, క్షేత్రపాలకుడికి పంచామృతాలతో అభిషేకం, ఆకుపూజ, అష్టోత్తర శతనామావళి, సహస్రనామ ఫల పుష్పార్చన, గోత్రనామార్చన, ఆరగింపు, మంగళాశాసనం, పాశుర ఉచ్ఛరణ, తీర్థప్రసాదగోష్టి వంటి కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గండు సైదులు, ఈఓ ఎంపీ లక్ష్మణరావు, అర్చకులు హరీష్‌కుమార్‌చార్యులు, మనోహరాచార్యులు, ఆలయ సిబ్బంది, కిరణ్‌గౌడ్, గోవిందరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచాలి

- ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా

కోదాడరూరల్ : గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసు యంత్రాంగం నిఘా పెంచాలని ట్రైనీ ఐపీఎస్ అధికారి రాజేష్‌మీనా అన్నారు. శిక్షణలో భాగంగా మంగళవారం ఆయన పట్టణంలో వాహనాలను తనిఖీ చేసి మాట్లాడారు. గంజాయి నిర్మూలనపై ప్రతిఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. గంజాయి అక్రమ రవాణాతో పాటు వాటి వాడకాన్ని నిర్మూలించాలన్నారు. రాష్ట్ర సరిహద్దు అయిన కోదాడ మీదుగా అక్రమ వ్యాపారాలు జరిగే అవకాశం ఉందని వాహనాల తనిఖీని ముమ్మరం చేయాలన్నారు. ఆయన వెంట పట్టణ సీఐ రాము, ట్రాఫిక్ ఎస్ఐ మల్లేష్, సిబ్బంది ఉన్నారు.

మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు చేయాలి

- హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి



మేళ్లచెరువు : సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

మేళ్లచెరువు : మహాశివరాత్రి జాతరకు ఏర్పాట్లు చేయాలని హుజూర్‌నగర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మేళ్లచెరువు మండల కేంద్రంలోని శ్రీ స్వయంభు శంభులింగేశ్వరస్వామి ఆలయంలో మార్చి 8 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించే మహాశివరాత్రి జాతర (స్వామివారి కల్యాణ మహోత్సవం) ఏర్పాట్లపై ఆర్డీఓ మంగళవారం ఆలయ ప్రాంగణంలో వైద్య, విద్యుత్, దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీపీ కొట్టె పద్మ సైదేశ్వరరావు, ఎన్పెస్పీ డీఈ స్వామి, విద్యుత్ ఏడీ ఈ వెంకన్న, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఎస్ఐ. పరమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ వెంకటరెడ్డి, పీఆర్ డీఈ వెంకటేశ్వర్లు, ఎంపీఓ వీరయ్య, మండల వైద్యాధికారి వేణుగోపాల్, పంచాయతీ సెక్రెటరీ నాగేంద్రబాబు, ఆలయ మేనేజర్ కొండారెడ్డి, మైహోం, కీర్తి, రెయిన్ సిమెంట్ పరిశ్రమల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతిని ఘనంగా జరుపుకోవాలి

హుజూర్‌నగర్ : శ్రీసంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గిరిజన సంప్రదాయంలో ఘనంగా జరుపుకోవాలని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ కన్వీనర్‌గా ధరావత్ నవీన్ నాయక్, సెక్రటరీగా తేజావత్ సైదులు నాయక్, కోశాధికారిగా బానోతు భాస్కర్, కమిటీస సభ్యులను ఎన్నుకున్నారు. సమావేశంలో ఆయా మండలాల తహసీల్దార్‌లు, గిరిజన నాయకులు తేజావత్ రవి నాయక్, మంజూనాయక్, గోపాల్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం



చైర్మన్ ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ సరితను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

నేరేడుచర్ల : మున్సిపాలిటీలో తాగునీరు, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్ పర్సన్ అలక సరిత అన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బాధ్యతగా పని చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని తెలిపారు. గత నాలుగేళ్ల కాలంలో మున్సిపాలిటీలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తామన్నారు. ఈనెల 15వ తేదీన మున్సిపల్ బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించి నివేదికను మంత్రి దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తాము చైర్మన్‌గా, వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యేందుకు అన్ని విధాలుగా సహకరించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి, కాంగ్రెస్ కౌన్సిలర్లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

చైర్మన్, వైస్ చైర్ పర్సన్‌కు సన్మానం

నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ బచ్చలకూరి ప్రకాశ్, వైస్ చైర్‌పర్సన్ అలక సరితను పీఆర్‌టీయూ పాలకీడు, నేరేడుచర్ల మండలాల కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ పాలకీడు మండల అధ్యక్షుడు కొణతం వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రగడ శేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు నాయిని శ్రీనివాస్, జిల్లా కార్యదర్శులు ఎస్‌కె యూసుఫ్, యడవల్లి అనంత్‌రెడ్డి, గంధం ధర్మరాజు, నాగరాజు, ప్రసాద్, రమేష్, కిరణ్, స్వప్న, నారాయణరెడ్డి, కనకతార, విజయకుమారి, సైదమ్మ, కృపాని, అంజయ్య, జానీ తదితరులు ఉన్నారు.

గ్రామీణ భారత్ బంద్‌కు మద్దతు ఇవ్వాలి



హుజూర్‌నగర్‌లోని పొట్టి శ్రీరాములు సెంటర్‌లో మాట్లాడుతున్న నాయకులు

హుజూర్‌నగర్ : కేంద్రం అవలంబిస్తున్న రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా 16న నిర్వహించే గ్రామీణ భారత్ బంద్‌కు వాణిజ్య, వ్యాపార వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు ఒక్కవంతుల కోటేశ్వరరావు, కంబాల శ్రీనివాస్, పల్లె వెంకట్‌రెడ్డి, దొంగరి వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని అనుమాల లింగయ్య భవన్‌లో కొప్పోజు సూర్యనారాయణ అధ్యక్షతన ఆ కమిటీల సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలో వారు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ముగింపు సభలో స్వామినాథన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంఘాల, పార్టీల నాయకులు రాములు, బ్రహ్మం, గురువయ్య, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు, శ్రీను, నవీన్, సైదులు, అంజిరెడ్డి, రమేష్, హుస్సేన్, అజయ్, చంద్రం, వెంకటరెడ్డి, నరసయ్య, ప్రసాద్, వెంకయ్య, మల్లయ్య, రాము తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్‌లో పార్ బాయిల్డ్ రైస్ మిల్ల్ డ్రైవర్లు, వర్కర్లు పాల్గొన్ని విజయవంతం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్ నాయకులు బెల్లంకొండ గురవయ్య, శీలం శ్రీను, పచ్చిపాల ఉపేందర్ అన్నారు. మంగళవారం హుజూర్‌నగర్ పట్టణంలోని పార్ బాయిల్డ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు పొలిశెట్టి నర్సింహారావు, గజ్జి ప్రభాకర్‌లకు సమ్మె నోటీసు అందజేసి బంద్‌కు సహకరించాలని కోరారు. నాయకులు చింతకాయల రాము, సలిగంటి జానయ్య, మేకపోతుల వీరబాబు, చింతకాయల పర్వతాలు, పల్లె క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

భారత్ బంద్ పోస్టర్ల ఆవిష్కరణ

మఠంపల్లి : ఈనెల 16న చేపట్టిన గ్రామీణ భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ కోరారు. మంగళవారం మఠంపల్లిలో మహిళా కార్మికులతో కలిసి భారత్ బంద్ పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. శ్రీను, నాగమణి, రమాదేవి, హారిక, ఉమా, సరితా, సైదమ్మ, సుజాత, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : ఈ నెల 16న నిర్వహించే కార్మికుల సమ్మె గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ కోరారు. మంగళవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో బంద్ పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సుందరయ్య, ఉమాలక్ష్మి, ఇందిరమ్మ, అంజమ్మ, దీనారాణి, లక్ష్మి, నాగేంద్ర, భేగం, నాగమణి పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

చిలుకూరు : ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే గ్రామీణ భారత్ బంద్, కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. మంగళవారం చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రాంబాబుకు, మండల పరిషత్, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వేనేపల్లి వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి నాగాటి రాములు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

నేరేడుచర్ల : ఈనెల 16న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు భాగస్వాములై విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ రామ్మూర్తి పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన వివిధ కార్మిక సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిరికొండ శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ధనుంజయనాయుడు, కోదాటి సైదులు, రుద్రమ్మ, జయమ్మ, భాస్కర్‌రెడ్డి, శ్రీను, మల్లయ్య, సయ్యద్ తదితరులు ఉన్నారు.

నేరేడుచర్ల : నెల 16వ తేదీన జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయనాయుడు కోరారు. మంగళవారం నేరేడుచర్లలో జరిగిన సీపీఐ ప్రజా సంఘాల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుని కల్యాణం

మఠంపల్లి : మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, నిత్యహోమం పూర్తిగావించి శ్రీస్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో వధూవరులుగా అందంగా ముస్తాబు చేసి ఎదుర్కోళ్ల మహోత్సవ సంవాదం రసవత్తరంగా రక్తిగట్టించారు. కల్యాణతంతులో భాగంగా విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాభంధనం, రుత్విగ్వరణం, పంచగవ్య ప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణను తలంబ్రాల మహోత్సవంతో ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో నవీన్‌కుమార్, అర్చకులు అద్దేపల్లి లక్ష్మణా చార్యులు, పద్మనాభాచార్యులు, బదరీ నారాయణా చార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఫణిభూషణ మంగాచార్యులు, ఆంజనేయాచార్యులు, భక్తులు పాల్గొన్నారు.